క్లుప్తంగా

ఓపెన్ స్కూల్‌లో మంచి ఫలితాలు

సామర్లకోట: ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో మంచి రిజల్టు వచ్చిందని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. ఓపెన్ స్కూల్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ నిర్వహిస్తున్న విషయం విదితమే. 10వ తరగతి పరీక్షలకు 58 మంది హాజరుకాగా 51 మంది పాస్ కావడం ద్వారా 88 శాతం వచ్చింది. ఇంటర్ పరీక్షలకు 45 మంది హాజరు కాగా 41 మంది పాస్ కావడంతో 91 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూన్ రెండు నుంచి జరిగే 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఆర్థిక సాయం


రాజశేఖరరెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలో పలు కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. నాగులపల్లికి చెందిన కూనిశెట్టి రాజశేఖరరెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన కుటుంబానికి రూ.10వేలు, పొన్నాడకు చెందిన కాకాడ శేషులు కుటుంబానికి రూ.5వేలు, కొత్తమూలపేటకు చెందిన గురజాపు సత్తులు ప్రమాదంలోని గాయపడి ఉండడంతో పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని నిరాహార దీక్ష

పిఠాపురం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జగన్నాథం అన్నారు. పిఠాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద పిఠాపురం తాలూకా యూనియన్ అధ్యక్షుడు కేవీ రామారెడ్డి, కార్య దర్శి ఎం.ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జగన్నాథంమాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డీ.వీరయ్య, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. దీనికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. జ్యేష్ఠ మాసం తొలి సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. తొలి పూజను పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో ఆలయ అర్చకులు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను, ఆలయంలోని ఉప ఆలయాలలోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు, సభ్యులు భక్తులకు సేవలందించారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం


షెడ్డుకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు రామిశెట్టిపేటలో వలల మరమ్మతులు చేసుకునేందుకు అవసరమైన షెడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు ఎంపీపీ నిధులతో సోమవారం శంకుస్థాపన స్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అనాల సుదర్శన్, సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ పాల్గొన్నారు.

శరవేగంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం

- పిఠాపురం నియోజకవర్గంలో 54 సెంటర్లు మంజూరు
- వివిధ దశల్లో ఉన్న పనులు


ఇసుకపల్లిలో పూర్తికావస్తున్న హెల్త్ క్లినిక్ సెంటర్

కొత్తపల్లి: పేదలకు సొంత ఊరిలోనే వైద్యం అందించాలని ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేసింది. గ్రామస్థాయిలో 24 గంటలు వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టింది. పిఠాపురం నియోజకవర్గంలో 54 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరయ్యాయి. ఈ భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒక్కో క్లినిక్‌ను రూ.17.80 లక్షలతో నిర్మిస్తున్నారు. ఈ క్లినిక్‌ల నిర్మాణాలు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. పలు క్లినిక్ సెంటర్లు ప్రారంభానికి సిద్ధంగా కాగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పేరిట గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయాల పరిధిలో ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మూడు మండలాల పరిధిలో


నాగులాపల్లిలో నిర్మాణ దశలో ఉన్న హెల్త్ క్లినిక్ సెంటర్

హెల్త్ సెంటర్ల నిర్మాణం 20కి పైగా చివరి దశకు చేరుకోగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. కొత్తపల్లి మండలంలోని ఇసుకపల్లి, నాగులాపల్లిలో భవన నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయి. ఈ నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

త్వరగా పూర్తి చేస్తాం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. నాగులాపల్లి, ఇసుకపల్లిలో భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. ఇంకా నిర్మాణ పనులు చేపట్టాల్సిన గ్రామాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

–జి.శ్రీనివాస్, మండల ఇంజినీరింగ్ అధికారి, కొత్తపల్లి మండలం

తీరనున్న కష్టాలు

గ్రామంలో వైఎస్సార్ క్లినిక్ ఏర్పాటుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో రాత్రి సమయంలో వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. ఇప్పుడు ఆందోళన అవసరంలేదు. వైఎస్సార్ క్లినిక్ వచ్చేస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలోనే పేదలకు వైద్య సేవలు అదించడం సంతోషం.

–సన్నిబోయిన ఎలీషా, ఇసుకపల్లి

పేదల అభ్యున్నతే లక్ష్యం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- పెద్దాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల లబ్ధిని గృహిణికి వివరిస్తున్న దొరబాబు

పెద్దాపురం : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దాపురంలోని 12వ సచివాలయం పరిధిలో 23వ వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బందితో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు గడపగడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, సేపేని సురేష్, కో–ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

కోనేరులో పూడికతీత పనులు


జేసీబీ సాయంతో సాగుతున్న పనులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం వద్ద కోనేరులో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. 15 ఏళ్లుగా కోనేరులో పూడికతీసి ఇసుక వేయాలని మొర పెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయ కోనేరుపై ప్రత్యేక దృష్టి సారించారు. పిఠాపురం పాదగయ పుష్కరిణి తయారు చేసిన విధంగా పంచా రామ క్షేత్రం వద్ద పుష్కరిణిని కూడా తయారు చేయాలని నిర్ణయించారు. అయితే దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం లేకపోవడంతో కేంద్ర పురావస్తు శాఖ దృష్టికి ఆలయ కోనేరు పరిస్థితిని తీసుకు వెళ్లారు. ఆలయ కోనేరులో జిగురు మట్టి ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. పుష్కరిణి మధ్యలో మంటపం ఉంది. దాంతో విద్యార్థులు తరుచూ ఈ మంటపం ఎక్కి కోనేరులోకి దూకి స్నానాలు చేసేవారు. ఈ క్రమంలో ఐదుగురు వరకు మృతి చెందడంతో ఆలయ అధికారులు మంటపం చుట్టూ ఇనుప తీగను ఏర్పాటు చేశారు. అయినా విద్యార్థులు కోనేరులో స్నానాలు చేయడం తగ్గలేదు. పూడికతీతకు పురావస్తు శాఖ రూ.33 లక్షలు మంజూరు చేసింది. చెరువు ఎండి పోవడంతో సోమవారం నుంచి జేసీబీ ద్వారా పూడికతీత పనులు ప్రారంభించారు. పనులను ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు


విశ్రాంత ఉపాధ్యాయుడు వీరభద్రరావు, విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ లభిస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు దున్న వీరభద్రరావు అన్నారు. పాత ఇసుకపల్లిలో గొర్ల వెంకటరావు, మంగయమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉత్తమ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ గొర్ల పెద్దిరాజు, సునీత దంపతులు చేతుల మీదుగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన యల్లమిల్లి లోకేష్‌చంద్రార్జున్, పాలెపు సుజాతకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి నగదు, మెమెంటోను అందజేశారు. 7వ తరగతిలో ప్రతిభ కనబరిచిన వారికి రూ.500, మెమెంటోను అందజేశారు. అనంతరం కొత్తపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా గత 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.సుబ్బారావు, కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ అవినీతిపై విచారణ


విచారణ జరుపుతున్న రాష్ట్ర బృందం

పెద్దాపురం: మండలంలోని రాయభూపాలపట్నంలో ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ కలిదిండి రామకృష్ణ అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర అధికార బృందం బహిరంగ విచారణ జరిపింది. పంచాయతీరాజ్ కమిషనరేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వైవీవీ ప్రసాద్, అంబుడ్స్‌మన్ జ్యోతి, ఎస్ఆర్‌పీ తిరుపతిరావు, ఏపీడీ భానుప్రకాష్, ఎంపీడీఓ హిమమహేశ్వరి కూలీలు, గ్రామస్తులతో మాట్లాడి రామకృష్ణపై వచ్చిన అవినీతి ఆరోపణపై విచారణ జరిపారు. దొంగ మస్తర్లు వేశారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇటీవలే బహిరంగ సామాజిక వేదిక సుమారు 80 వేల రూపాయలు అవినీతి జరిగినట్లు తేల్చింది. దీంతో అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఇంకా మస్తర్ల విషయంలో సుమారు రూ.మూడు లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర బృందం విచారణ చేపట్టింది. ఇంత జరుగుతున్నా ఏపీడీ, ఏపీఓ పర్యవేక్షణ ఎందుకు లేదంటూ రాష్ట్ర బృందం అధికారులపై మండిపడింది. అజమాయిషీ లోపంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వరప్రసాద్ మాట్లాడుతూ విచారణ నివేదికను మూడు రోజుల్లో కమిషనర్‌కు అందజేస్తామన్నారు.

25న జగనన్న ఆణిముత్యాలుకు సత్కారం

సామర్లకోట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను «జగనన్న ఆణిముత్యాలు» కార్యక్రమంలో ఈ నెల 25వ తేదీన పెద్దాపురంలో సత్కరిస్తామని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10వేలు, రూ.ఐదు వేలు చొప్పున ప్రోత్సాహకం ఇస్తామని చెప్పారు. చంద్రంపాలెం శివారు ఉప్పరగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తలాటం లక్ష్మీ ప్రథమ, నవర జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సన్నిబోయిన అర్చన ద్వితీయ, అదే స్కూలు విద్యార్థిని బొల్లంరెడ్డి ప్రజ్ఞశ్రీ సాయి తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు.

ఏపీఆర్ఎస్ఏ ఎన్నిక రేపు

పెద్దాపురం: ఏపీఆర్ఎస్ఏ పెద్దాపురం డివిజన్ ఎన్నికలు విజయవంతం చేయాలని పిఠాపురం డీటీ డి.కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపీఆర్ఎస్ఏ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో 2023–2026 సంవత్సరానికి గాను బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకూ ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియకు పెద్దాపురం రెవెన్యూ సిబ్బంది సహకరించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం సమీపంలోని రెండో తూము వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సుమారు 70 ఏళ్ల వ్యక్తి మల్లవరంలో నెల రోజులుగా భిక్షాటన చేస్తున్నాడు. అతను సోమవారం చేబ్రోలు జంక్షన్ నుంచి మల్లవరం వెళ్లే రోడ్డలోని రెండో తూము వద్ద మృతి చెంది ఉన్నాడు. గ్రామ రెవెన్యూ అధికారి ఆర్.గోవిందరాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పిఠాపురం ఆసుపత్రిలో భద్రపరచనున్నట్టు పోలీసులు తెలిపారు.


ఆర్పీలు అవగాహన పెంచుకోవాలి


శిక్షణకు హాజరైన రామచంద్రపురం మున్సిపాలిటీ మెప్మాలోని ఆర్పీలు

సామర్లకోట: మెప్మా రీసోర్సు పర్సన్లు శిక్షణలో ఇచ్చే అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రీసోర్సు పర్సన్ రాజశేఖర్ అన్నారు. కాకినాడ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలో మెప్మా రీసోర్సు పర్సన్లకు ఇస్తున్న శిక్షణలో భాగంగా సోమవారం రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీలకు రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. మెప్మా పరిధిలోని ఆర్పీలు తమ విధులను వేగంగా, సక్రమంగా నిర్వహించి ఆన్‌లైన్‌లో సమాచారం పొందుపర్చడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై శిక్షణ నిర్వహించారు. రామచంద్రపురం మెప్మా సీఎంఎం, సీఓలు పాల్గొన్నారు. మంగళవారం వీరి శిక్షణ ముగుస్తుంది. బుధవారం నుంచి కాకినాడ కార్పొరేషన్‌లోని ఆర్పీలకు శిక్షణ ఉంటుందని డీఆర్పీ రాజశేఖర్ తెలిపారు.

శరత్‌బాబు నన్ను ప్రోత్సహించారు

సినీ దర్శకుడు ఆనంద్


శరత్‌బాబుకు డైలాగ్ వివరిస్తున్న దర్శకుడు కేబీ ఆనంద్ (పాత చిత్రం)

సామర్లకోట: సీనియర్ సినినటుడు శరత్‌బాబు మృతి పట్ల దర్శకుడు, నటుడు కేబీ ఆనంద్ తీవ్ర సంతాపం తెలిపారు. సోమవారం రాత్రి ఆనంద్ స్థానిక బట్లబజార్‌లోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ తాను 2014 దర్శకత్వం వహించిన 'రెండేళ్ల తరువాత' మొట్టమొదటి సినిమాలో హీరోగా నటించిన శరత్‌బాబు తనను ఎంతగానో ప్రోత్సహించారని తెలిపారు. అటువంటి నటుడి మరణవార్తను తాను తట్టుకోలేక పోతున్నానన్నారు. విశ్వనాథ్, బాలచందర్ వంటి మేధావులతో కలిసి పనిచేసిన శరత్‌బాబు తాను తీసిన మొదటి సినిమాలో మంచి మంచి సలహాలు ఇచ్చి ప్రోత్సహించారని తెలిపారు. శరత్‌బాబు ఇచ్చిన షెడ్యూల్‌లో సినిమా షూటింగ్ పూర్తి కాకపోతే మరి కొంత సమయం ఇచ్చే వారని చెప్పారు. అటువంటి నటుడు ఇక లేరని తెలిసి బాధగా ఉందన్నారు.

వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షం దుష్ప్రచారం
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని 4, 5, 6 వార్డుల్లో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలిపి, గ్రామస్తుల పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పచ్చచొక్కా నాయకులు ఎల్లో మీడియా ద్వారా దష్ప్రచారం చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల నియామకంతో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. ఈ రాష్ట్రాన్ని మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు.

తప్పుడు ప్రచారం చేసినంతమాత్రాన ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 175 సీట్లు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

పిఠాపురానికి పల్లె వెలుగు బస్సు నడపాలి


సామర్లకోట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన దళిత నాయకులు

సామర్లకోట: పిఠాపురానికి పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక దళిత సంఘ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు స్పందనలో వినతి పత్రం అందజేశారు. సామర్లకోట– పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువపై కూలి పోయిన వంతెన స్థానంలో వంతెన నిర్మాణం పూర్తి కావడంతో బస్సులను తిప్పాలన్నారు. వంతెన నిర్మాణ పనులతో గత రెండేళ్లుగా బస్సులను నిలిపి వేశారని దళిత సంఘ నాయకులు నూతలపాటి అప్పలకొండ, కుంచే నానిబాబులు తెలిపారు. దాంతో ఆటోలు సామర్లకోట నుంచి పిఠాపురానికి రూ.50 వసూలు చేస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి మాట్లాడుతూ ఆర్టీసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతామని చెప్పారు.

డివిజన్ స్థాయి స్పందనకు 11 అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 11 అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు.

భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని, శ్మశాన వాటికను ఆనుకున్న ఆక్రమణలు తొలగించాలని, భూ తగాదా పరిష్కరించాలని, తదితర సమస్యలపై 11 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించానని తెలిపారు. డీఎల్‌పీఓ బాలామణి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, ఎంఈఓ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి పాల్గొన్నారు.

పిడుగుపాటు మృతుని కుటుంబానికి పరామర్శ


శ్రీనివాసు చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన దవులూరి

సామర్లకోట: ఇటీవల పిడుగు పాటుకు మృతిచెందిన యువకుని కుటుంబాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సోమవారం పరామర్శించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామం చెక్ డాం వద్ద తన స్నేహితులతో స్నానాలకు దిగి బయటకు వచ్చిన సమయంలో పిడుగు పడటంతో స్థానిక 29వ వార్డు గాంధీనగర్‌కు చెందిన ప్రక్కుతి శ్రీనివాసు మృతి చెందిన విషయం విదితమే. శ్రీనివాసు చిత్రపటానికి పూలమాల వేసి దొరబాబు నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్ కుమార్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ, మద్రి శేషారావు, పిట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

పెద్దాపురం: దివంగత నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు కృషి చేద్దామని మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. మండలంలోని సిరివాడ గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ విగ్రహాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కొత్తెం కోటి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు.